

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు జిల్లా ప్రాజెక్టు ఎంపిక

నిజామాబాద్ అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలలో జిల్లాకు చెందిన శ్రీనూతన వైశ్య పాఠశాల విద్యార్థి శివమణి రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ తెలిపారు. ఈనెల 7, 8, 9 తేదీలలో జడ్చర్లలో జరిగిన రాష్ట్ర స్థాయి రాష్ట్రీయ బాలవైజ్ఞానిక ప్రదర్శన, రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో జిల్లా నుంచి 13 ఇన్‌స్పైర్ అవార్డులకు సంబంధించిన ప్రదర్శనలు, 15 సైన్స్‌ఫేర్ ప్రదర్శనలు ప్రదర్శించారు. బాలవైజ్ఞానిక ప్రదర్శనకు సౌత్ ఇండియా స్థాయిలో మూడు ప్రదర్శనలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.



పూజలు నిర్వహిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి

ముక్కోటి దేవతల అనుగ్రహం లభిస్తుంది

● గణపతి సచ్చిదానంద స్వామి

నిజామాబాద్ కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి రోజున వైకుంఠ నాథున్ని దర్శించుకోవడం అంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్న పుణ్యం లభిస్తుందని గణపతి సచ్చిదానంద స్వామీ ప్రవచనం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్ ఫేస్-2లో గల ఉత్తర తిరుపతి క్షేత్రంలో జరిగిన వైకుంఠ ఉత్తర ద్వార దర్శనంలో స్వామీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ప్రవచనం చేస్తూ భగవంతుని ఆరాధనలో ఏకాదశికి ప్రత్యేకత ఉందని పుష్యమాసంలో వచ్చే ఏకాదశి వైకుంఠ ఏకాదశిగా వైకుంఠ నాథున్ని దర్శించుకోవడం భగవత్ అనుగ్రహం వస్తుందని అన్నారు. హిందూ సంప్రదాయంలో పండుగలు, పర్వదినాలకు ప్రత్యేకత ఉందని భావిత రాల వారికి మనసంప్రదాయాలను, సంస్కృతిని పండుగల విశిష్టతను తెలియజేయాలని అన్నారు. ప్రతీరోజు తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు భగవద్గీత, మహాభారతం వంటి గ్రంథాల విషయాలను తెలియజేయాలని సూచించారు. అనంతరం ఆలయంలోని వైకుంఠ ఉత్తర ద్వారానికి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీచక్రానికి ప్రత్యేక అర్చనలు జరిపారు. ఆలయంలో జరిగిన వైకుంఠ ఏకాదశి పూజలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వైకుంఠ ఉత్తర ద్వారం గుండా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడిని దర్శించుకున్నారు. ఉదయం ప్రారంభమైన వైకుంఠ ద్వారా దర్శనం రాత్రి వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ సంపత్‌కుమార్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఘనంగా వైకుంఠ ఏకాదశి

- ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్న భక్తులు
- గరుడ వాహనంపై దర్శనమిచ్చిన స్వామి
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

7





అంజిరెడ్డి, గ్రాడ్యుయేట్ అభ్యర్థి



కొమురయ్య, టీచర్ అభ్యర్థి



వంగ మహేందర్‌రెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు

గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

- గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా అంజిరెడ్డి, టీచర్ అభ్యర్థిగా మల్క కొమురయ్య
- ఇతర పార్టీల కంటే ముందే ప్రకటించిన బీజేపీ నేతలు
- ఇంకా అభ్యర్థులను ఖరారు చేయని కాంగ్రెస్, బీఆర్ఎస్
- పీఆర్‌టీయూ అభ్యర్థిగా వంగ మహేందర్‌రెడ్డి

నిజామాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ సిద్ధమైంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీతో పాటు టీచర్ ఎమ్మెల్సీకి అభ్యర్థులను ప్రకటించింది. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీరు ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని ప్రకటించింది. ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాలకు చెందిన వారిని అభ్యర్థులుగా నిర్ణయించారు. మిగతా పార్టీలకంటే ముందుగానే తమ అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించారు. బీజేపీ అభ్యర్థులను ప్రకటించగా ఇంకా కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రకటించలేదు. పీఆర్‌టీయూ మాత్రం తమ టీచర్ అభ్యర్థిని రెండు నెలల క్రితమే ప్రకటించింది. ప్రధాన పార్టీల నేతలతో పాటు స్వతంత్రులు కూడా ఎక్కువ మంది పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

మార్చి 29న ముగియనున్న పదవీ కాలం

ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీతో పాటు టీచర్ ఎమ్మెల్సీల పదవీకాలం వచ్చే మార్చి 29న ముగియనుంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ప్రస్తుతం కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కొనసాగుతున్నారు. టీచర్ ఎమ్మెల్సీగా రఘోత్తంరెడ్డి ఉన్నారు. వీరి పదవీకాలం మరో రెండున్నర నెలలో పూర్తవుతుంది. కేంద్ర ఎన్నికల కమిషన్ కూడా ఈ ఎన్నికల కోసం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు లిస్టులను ప్రకటించింది. జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కోసం 33 మండలాల పరిధిలో 48పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తు న్నట్లు అధికారులు ప్రకటించారు. వీటి పరిధిలో మొత్తం 30 వేల 593 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. వీరిలో పురుష ఓటర్లు 19వేల 368 మంది, మహిళా ఓటర్లు 11వేల 225 మంది ఉన్నట్లు ప్రకటించారు. టీచర్ ఎమ్మెల్సీ కోసం మొత్తం 33 మండలాల పరిధిలో 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటి పరిధిలో మొత్తం 3వేల 529 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. వీరిలో పురుష ఓటర్లు 2100 మహిళా ఓటర్లు 1429 మంది ఉన్నట్లు ప్రకటించారు.

త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్

కేంద్ర ఎన్నికల కమిషన్ త్వరలోనే నోటిఫికేషన్ ఈ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఇవ్వనుండటంతో ముందస్తుగా అభ్యర్థులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. పార్టీ తరఫున వీరు పోటీలో ఉంటారని తెలిపారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంకు చెందిన అంజిరెడ్డి బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఆయన సతీమణి ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షురాలిగా ఉన్నారు. బీజేపీలో పలు పదవులను చేయడంతో పాటు వ్యాపారంలో ఉన్న ఆయన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. పెద్దపల్లికి చెందిన విద్యాసంస్థల అధినేత మల్క కొమురయ్య టీచర్ అభ్యర్థిగా పోటీలో ఉంటారని ప్రకటించారు. పెద్దపల్లి, నిర్మల్, హైదరాబాద్‌లలో పలు విద్యాసంస్థలను నిర్వహిస్తున్న ఆయనను పార్టీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు.

నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు

బీజేపీకి నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో శాసన సభ్యులతో పాటు నలుగురు ఎంపీలు ఉండటం వల్ల తమకు కలిసివస్తుందని భావిస్తున్నారు. కరీంనగర్ నుంచి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఆదిలాబాద్ నుంచి ఎంపీగా గోడం నగేష్, నిజామాబాద్ నుంచి అర్వింద్, మెదక్ నుంచి రఘునందన్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో పార్టీకి ముగ్గురు ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డి, వెంకట్ రమణారెడ్డిలు ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మహేశ్వర్‌రెడ్డి, రామారావు పాటిల్, పాయల్ శంకర్, డాక్టర్ హరీష్‌లు ఉన్నారు. ఈ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ పరిధిలో నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు ఉండటం వల్ల తమకు కలిసి వస్తుందని బీజేపీ నేతలు భావిస్తున్నారు. టీచర్ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూకు చెందిన రఘోత్తంరెడ్డి ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరఫున పోటీ చేసేందుకు వంగ మహేందర్‌రెడ్డిని ప్రకటించారు. పీఆర్‌టీయూ తరఫున ఆయన పోటీ చేయనున్నారు. గత టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా పీఆర్‌టీయూ అభ్యర్థి గెలిచారు. ఈ సారి కూడా అదే రీతిలో రెండు నెలలుగా వంగ మహేందర్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో పెరిగిన ఆశావహుల సంఖ్య

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం వల్ల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి పోటీ పెరిగింది. రాష్ట్ర స్థాయిలో ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మరోదఫా పోటీలో ఉంటారని పార్టీ నేతగా సమాచారం బట్టి తెలుస్తోంది. ఆయనకు నామినేటెడ్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే వేరేవారికి అవకాశం ఇవ్వనున్నారు. గ్రాడ్యుయేట్ నియోజకవర్గం పరిధిలోని ఉమ్మడి నాలుగు జిల్లాల నుంచి పోటీ చేసేందుకు ఎక్కువ మంది సీనియర్ నేతలే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. వీరితో పాటు పలు విద్యాసంస్థల నేతలు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక సమీకరణాలతో పాటు నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో పరిచయం ఉన్న నేతలకు అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

ఇంకా నిర్ణయం తీసుకోని బీఆర్ఎస్

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఇంకా బీఆర్ఎస్‌లో పూర్తిస్థాయిలో చర్చ కొనసాగలేదు. రెండు నెలల క్రితం ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించిన నిర్ణయం తీసుకోలేదు. పలు అంశాలపై ఆందోళనలు నిర్వహిస్తున్నా పార్టీ నేతలు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలో కూడా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లా పరిధిలో పరిచయం ఉన్న అభ్యర్థిని బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు గత ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టలేదు. స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసిన అభ్యర్థికి మద్దతు ఇచ్చారు. ఈ ఎన్నికల్లో మాత్రం పోటీ చేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ లేదా బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతకు అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం.

ఎత్తొండ సహకార సంఘం

నష్టం.. రూ.9కోట్లు

- పాలకవర్గం చేసిన తప్పిదాలే కారణం
- విచారణలో అవినీతి, అక్రమాలు బహిర్గతం
- మాజీ చైర్మన్, కార్యదర్శుల నుంచి రికవరీ చేయాలని ఆడిట్ నివేదిక
- మరోమారు సమగ్ర విచారణ జరపాలన్న సభ్యులు

కోటగిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎత్తొండ సహకార సంఘం.. లాభాల బాట నుంచి సుమారు 9కోట్ల రూపాయల మేర నష్టానికి పాలకవర్గం చేసిన తప్పిదాలే కారణమని సహకార సంఘం ఉన్నతాధికారులు తేల్చారు. ఈ మేరకు సహకార సంఘంలో అవినీతి అక్రమాలపై జరిపిన విచారణలో ఈ విషయాలు బహిర్గతం అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఎత్తొండ సహకార సంఘం మహజన సభను శుక్రవారం చైర్మన్ రామదాసు అధ్యక్షతన నిర్వహించారు. సహకార సంఘం ఉన్నతాధికారుల ఆదేశం మేరకు సహకార సంఘం ఆడిటర్లు పుష్ప, రియాజ్‌లు సంఘంలో జరిగిన అక్రమాల విషయమై సంఘ సభ్యులకు వివరించారు. సంఘం మాజీ చైర్మన్ అశోక్ పటేల్ పదవీ కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ కొనసాగింది. ఈ విచారణలో సుమారు రూ. 9కోట్ల నష్టం జరిగినట్లు ఆడిటర్లు నివేదిక సమర్పించారు. సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ధాన్యంతో పాటు కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన ధాన్యం తడిసిపోవడంతో సంఘం నష్టాల పాలైందన్నారు. సివిల్ సప్లైకి, ఎఫ్‌సీఐకి బియ్యం చెల్లించలేకపోయారని ఆడిటర్లు వివరించారు. బియ్యం, నూక, తౌడు తదితర ఖర్చుల విషయంలో రికార్డుల నిర్వహణ లేకపోవడంతో సుమారు 8.70కోట్ల రూపాయల నష్టం జరిగినట్లు తెలిపారు. సహకార సంఘం ఆధ్వర్యంలో కిరాణ, జనరల్ స్టోర్‌లోనూ సిబ్బంది నిర్లక్ష్యంతో 2,65,781రూపాయల మేర నష్టం జరిగినట్లు నిర్ధారించారు. మాజీ చైర్మన్ తన పదవీ కాలంలో ఇతర ఖర్చుల కింద సంఘం నుంచి 6,32,487 రూపాయలు ఖర్చు చేశారని నివేదించారు. సస్పెన్స్ ఖాతా నుంచి మరో 1.60లక్షల రూపాయలను ఎలాంటి అనుమతి లేకుండా సొంతానికి వాడినట్లు నివేదికలో వెల్లడించారు. సహకార సంఘం నిబంధనల మేరకు సాధారణ సమావేశాలు కొనసాగలేదని స్పష్టం చేశారు. సంఘం వ్యాపార లావాదేవీలు, రికార్డుల నిర్వహణ సమగ్రంగా లేకుండా పోయిందన్నారు. పాలకవర్గ అనుమతి లేకుండా 3,82,79,569 రూపాయలు ఖర్చు చేసినట్లు నివేదికలో పొందుపర్చారు. పారాబాయిల్డ్ రైస్‌మిల్ ఆవరణలో అంచనాలకు మించి కోటి 50లక్షల రూపాయల వ్యయంతో గోదాం నిర్మించినట్లు వెల్లడించారు. ఇందులో రూ. 17 లక్షలను అదనంగా ఖర్చు చేసినట్లు నివేదికలో వివరించారు. ఈ అవినీతి, అక్రమాలకు మాజీ చైర్మన్ అశోక్ పటేల్, కార్యదర్శి సంతోష్‌తో పాటు పాలకవర్గ సభ్యులు బాధ్యత వహించాల్సి వస్తుందని నివేదికలో వెల్లడించారు. నిర్ణీత గడువులోపు డబ్బు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు ఉంటాయని వారు స్పష్టం చేశారు. ఈ విషయమై సంఘసభ్యులు నిధుల రికవరీ చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. దీంతో ఈ వ్యవహారంలో ప్రస్తుత పాలకవర్గానికి, సంఘ సభ్యులకు మధ్య కొంతసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రస్తుత పాలకవర్గంలో కొందరు సభ్యులు మాట్లాడుతూ.. తాము సమావేశానికి హాజరయ్యామే తప్ప.. తమకు ఎలాంటి లావాదేవీలను లిఖిత పూర్వకంగా చూపించలేదని తెలిపారు. మరికొంతమంది సభ్యులు మాట్లాడుతూ.. మాజీ చైర్మన్ పదవీ కాలం కంటే ముందు ఉన్న గత పాలకవర్గంలో జరిగిన లావాదేవీలపైనా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సంఘ నష్టానికి కారకులైన వారిపై చర్యలు తీసుకొని.. సంఘాన్ని నష్టాల నుంచి గట్టెక్కించాలని డిమాండ్ చేశారు.



సహకార సంఘ మహజన సభలో ఆడిట్ నివేదికను వెల్లడిస్తున్న ఆడిటర్ పుష్ప



హైదరాబాద్ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

● 64ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకున్న పూర్వవిద్యార్థులు

ఆర్మూర్‌రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలకు చెందిన 1959-60 సంవత్సరపు పదో తరగతి (హెచ్ఎస్సీ) పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం అంకాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు అనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వృత్తిపరంగా వివిధ ప్రాంతాల్లో, వివిధ దేశాల్లో నివాసిస్తున్నప్పటికీ 64ఏళ్ల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లింగాగౌడ్, నేముల రాంచందర్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాధ కిషన్, శేఖర్, శేఖర్, రాంరెడ్డి, గంగారెడ్డి, డాక్టర్ వెంకటి, నర్సింలు, తదితరులు ఉన్నారు.



అంకాపూర్‌లో సమావేశమైన పదో తరగతి (హెచ్ఎస్‌సీ) 1959-60 బ్యాచ్ పూర్వవిద్యార్థులు

శ్రీవారిని దర్శించుకున్న జిల్లా ప్రముఖులు



అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలోని వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారం గుండా శ్రీవారిని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ దర్శించుకున్నారు. శుక్రవారం వేకువ జామునే కుటుంబ సమేతంగా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్షదైవమైన వెంకటేశ్వర స్వామి అనుగ్రహంతో తెలుగు రాష్ట్రాల ప్రజలు పాడిపంటలతో ఆయురారోగ్యంతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

రూరల్ ఎమ్మెల్యే ..

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతిలో వెంకటేశ్వర స్వామిని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి దర్శించుకున్నారు. వేకువజామున కుటుంబ సమేతంగా ఆయన ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు.

అర్బన్ ఎమ్మెల్యే.

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమలేశుడిని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ దర్శించుకున్నారు. వేకువజామునే వీఐపీ బ్రేక్ దర్శనంలో కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తెలుగు ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఏకాదశి పండుగను జరుపుకోవాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ ఆకాంక్షించారు.



కుటుంబ సభ్యులతో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోడల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

నవీపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో చేరడానికి 100 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లకు సైతం అడ్మిషన్లు తీసుకోవడానికి ఈ నెల 6 నుంచి వచ్చే నెల 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని ఆయన వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎడపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఎడపల్లి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎడపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని బోధన్ రూరల్‌లోని కల్దుర్కి, ఎరాజ్‌పల్లి, ఊట్‌పల్లి, ఎడపల్లి మండలంలోని శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5గంటల వరకు రెంజల్ మండలంలోని రెంజల్‌లో మాత్రం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

ఆర్మూర్‌టౌన్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌లో అంతరాయం ఏర్పాడుతుందని పెర్కిట్ ఏఈ మౌనిక తెలిపారు. మండలంలోని పెర్కిట్, మామిడిపల్లి, గోవింద్‌పేట్, కోమన్‌పల్లి, సుర్బిర్యాల్ గ్రామాల్లో శనివారం సబ్‌స్టేషన్ పనుల నిమిత్తం మధ్యాహ్నం 3నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఉండదని ఈ విషయాన్ని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు సహకరించాలన్నారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

రుద్రూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రుద్రూరులో చోటు చేసుకుంది. రుద్రూరు ఎస్ఐ సాయన్న తెలిపిన వివరాల ప్రకారం రుద్రూరు గ్రామానికి చెందిన నేకంటి శారద(34)అను మహిళ కడుపు నొప్పి, ఫిట్స్‌తో బాధపడుతూ అనారోగ్యం కారణంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం రుద్రూరు గ్రామ శివారులో ఉన్న చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుందన్నారు. మృతురాలు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

యువకుడి ఆత్మహత్య

రాజంపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్గొండ గ్రామంలో చౌదరి రాజశేఖర్ గురువారం రాత్రి బసవేశ్వర ఆలయ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. కొన్నేళ్ల క్రితం దుబాయికి వెళ్లిన రాజశేఖర్ అక్కడ పరిస్థితులు బాలేక తిరిగి స్వగ్రామానికి రావడంతో చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో హైదరాబాద్‌లో ప్రైవేట్ జాబ్‌చేస్తు నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. అప్పుల ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపం చెంది చెట్టుకి ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి సిద్ధిరాములు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసిదర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

దోమకొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం దోమకొండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండకు చెందిన సామల భరత్ కుమార్(34) ఈ నెల 6న రాత్రి అందదా 9 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగి కింద పడిపోగా అతని కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కామారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కొరకై హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరు..

దోమకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి చెందిన గొర్ల చంద్రయ్య(63) శుక్రవారం మధ్యాహ్నం తన గొర్రెల కొట్టంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి తెలిపారు. మృతునికి గత సంవత్సరం నుంచి కిడ్నీ సమస్యతో చికిత్స పొందుతూ డయాలసిస్ చికిత్స తీసుకుంటున్నాడని చంద్రయ్య జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పేలిన ఫ్రిజ్.. తప్పిన ప్రమాదం

దోమకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఒక ఇంట్లో ఫ్రిజ్ పేలింది.ఫ్రిజ్ పేలిన గదిలో ఎవరు లేకపోవడంతో ముప్పు తప్పినట్టయింది. పక్క గదిలో ఉన్న మహిళలు గమనించి అప్రమత్తమై వెంటనే స్థానికుల ద్వారా విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్‌లో విషయం తెలియజేయడంతో వెంటనే గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విద్యుత్ సరఫరా నిలిపేంత వరకు ఫ్రిజ్ వద్ద పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. కాలనీ వాసులు గదిలో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను అతి కష్టం మీద బయటకు తీసుకువచ్చారు. విద్యుత్ శాఖ హెల్పర్ రాజు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

నాగిరెడ్డిపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని బంజార గ్రామం వద్ద హైదరాబాద్ - బోధన్ ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాసన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, మండల కేంద్రం నుంచి మాసాన్ పల్లికి బైక్‌పై వెళుతుండగా, జప్తి జనకంపల్లి గ్రామానికి చెందిన సొల్లు రాములు, అదే గ్రామానికి చెందిన సమతలు బైక్ పైన మండల కేంద్రానికి వస్తుండగా బంజార గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై మల్లారెడ్డి క్షతగాత్రులను 108లో మెదక్ ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, జనవరి10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లక్ష్మీనర్సింహ వైన్స్ చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ బైపాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక కారులో ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకొని విచారించగా బుధవారం రాత్రి లక్ష్మీనర్సింహ వైన్స్‌షాప్‌లో దొంగతనంకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని ఆయన తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన చౌహాన్ రవి, షేక్ సుబ్, గణేష్‌పండగలేలను అరెస్టు చేసి వారి వద్ద ఉన్న ఒక కారు, రెండు పల్సర్ బైక్‌లు, రూ.2వేల నగదు, ఒక విస్కీ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేసును చేధించిన ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, ఎస్సై గోవింద్, హెడ్‌కానిస్టేబుల్ తిరుపతిలను అభినందించి అవార్డులను అందజేశారు. అడిషనల్ డీసీపీ వెంట ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



రమా సత్యనారాయణ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



కమ్మర్‌పల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి అలంకరణ



ఆలయంలో బారులు తీరిన భక్తులు

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

నవీపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవీపేటలోని దర్యాపూర్ శ్రీ వెంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆర్మూర్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచే మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకొని పూజలు నిర్వహించారు. కొటార్మూర్‌లోని విశాఖనగర్‌లో శ్రీరామ సత్యనారాయణ స్వామి ఆలయంలో వైభవంగా పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తరద్వార దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండల కేంద్రంలో రామాలయం, నర్సింహ స్వామి ఆలయం, అన్నారం వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. రంగురంగుల విద్యుత్‌దీపాల పుష్పాల అలంకరణతో ఆలయాలను చక్కగా వెలిగిపోతూ ఆధ్యాత్మిక శోభతో కళకళ లాడాయి. పవిత్ర పర్వదినం కావడంతో భక్తులు తమ దైవాన్ని దర్శించు కునేందుకు శుక్రవారం ఉదయం దేవాలయాలకు వెళ్లారు.

పెర్కిట్: పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో గల లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం, సిద్దులగుట్టపై గల రామాలయంలో, జిరాయత్‌నగర్‌లోని రామాలయంలో భక్తులు ఉత్తరద్వారం గుండా స్వామివారిని దర్శించు కున్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని వైష్ణవ ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజాకార్యక్రమాల అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం లభించగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. రాష్ట్రంలో ఉన్న ముడు శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆల యాల్లో ఒకటిగా ఉన్న అత్యంత పురాతనమైన మహిమాన్వితమై చౌట్‌పల్లిలో శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయాలో స్వామివారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి అర్చనలు విశేషంగా జరిపారు. గరుడ సేవపై స్వామివారి ఉత్సవ మూర్తులను వేంచేయింపజేసి ఆల య అర్చకులు సముద్రాల అమర్‌నాథ్‌చార్యులు పుష్పాలలతో అలంకరించి ప్రత్యేక అర్చనలు చేశారు. చౌట్‌పల్లి సహా కోనాసముందర్, బషీరాబాద్ గ్రామాల్లోని శ్రీలక్ష్మీవెంటేశ్వర ఆలయాల్లో భక్తులు వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా ఉత్తర ద్వార దర్శనాలు చేసుకుని తరించారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని వెంకటేశ్వర దేవాలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశ పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజాము నుంచి దేవాలయంలో ప్రదక్షిణాలు చేసి ఉత్తరద్వారం ద్వారా వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

ముప్కాల్: మండలంలోని వెంచి ర్యాల్, వేంపల్లి, నల్లూర్ గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆ లయాల్లో స్వామివారికి భక్తులు అభిషేకం, అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయాలు పూలతో అలం కరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు ఉత్తరద్వారం నుంచి ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు.

గోవింద నామస్మరణతో సకల శుభాలు

బోధన్‌రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గోవింద నామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయని కలియుగ దైవం ఏడుకొండల స్వామిని నిత్యం స్మరిస్తే సకల శుభాలు కలుగుతాయని వెంకటేశ్వర ఆలయ వేద పండితులు అన్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా బోధన్ పట్టణంలోని వెంకటేశ్వరాలయం, శ్రీనివాస్‌నగర్‌లోని వెంకటేశ్వర ఆలయంతో పాటు ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. ఈసందర్భంగా ఆలయ వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని, కరోనా వంటి మహమ్మారి రావొద్దని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెట్రోలు బంకులో కల్తీ ..వాహన దారులు ఆగ్రహం

పిట్లం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్‌పి పెట్రోలు పంపులో నీరుతో కూడిన పెట్రోలు రావడంతో వాహన దారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పెట్రోలు బంకులో కౌలాస్ గ్రామానికి చెందిన ఉస్మాన్ తన వాహనంలో పెట్రోలు అయిపోవడంతో వెంటనే పెట్రోలు బంకులోనికి డబ్బాతో వెళ్ళగ, నీటి రంగుతో కూడిన పెట్రోలు రావడంతో సిబ్బందిని వాహన దారులు అందరు కలిసి ఇదేం కల్తీ పెట్రోలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల అధికారుల తనిఖీలు కరువై పంపులలో ఇష్టారాజ్యంగా కల్తీ పెట్రోలు దందా కొనసాగుతుందని వాహన దారులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంపు నిర్వాహకులపై చర్యలు తీసుకొవాలని డిమాండ్ చెశారు.

ప్రభుత్వ పాఠశాలలో దొంగతనం

భీమ్‌గల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని బాపూజీనగర్ కాలనీలో ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం రాత్రి గుర్తుతెలియని దొంగలు సాంసంగ్ ట్యాబ్, 25 కిలోల బియ్యం, నాలుగు భోజనం గిన్నెలు దొంగిలించారని పాఠశాల హెచ్ఎం శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై మహేష్‌కుమార్ తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దులగుట్ట వెనుక టీచర్స్‌కాలనీలో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను పట్టణంలోని దోబిఘాట్ వద్ద అరెస్టు చేసినట్లు అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత సామాన్లు ఎరుకుంటూ జీవనం గడుపుతున్న మైలారం సోమేష్‌ను బుధవారం అర్ధరాత్రి కనపర్తి సత్యనారాయణ, రాజు, బడే రవిలు కలిసి సోమేష్ నిద్రిస్తున్న సమయంలో వెదురుబొంగు కట్టేతో కొట్టి కత్తెరతో పొడిచి చంపినట్లు నిందితులు ఒప్పుకున్నారని, కేసును చేదించిన ఎస్‌హెచ్‌వో సత్యనారాయణతో పాటు పోలీస్ సిబ్బందిని అడిషనల్ డీసీపీ అభినందించి రివార్డులు అందజేశారు. ఆయన వెంట ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామన్నపేట్ వీడీసీ కార్యవర్గం ఎన్నిక

వేల్పూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీడీసీ అధ్యక్షుడిగా గుమ్ముల కిషన్, ఉపాధ్యక్షునిగా రాజరాపు రాజేశ్వర్, క్యాషియర్‌గా పిప్పెర లింబాద్రి, సబ్‌స్టేషన్ అధ్యక్షులుగా ఏలుక హరిష్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పూలే అవార్డుల ప్రదానం

వేల్పూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల పీఆర్‌టీయు టీఎస్ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోడ దేవనందం, సీవీ.నర్సింహరావు ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రి బా యి పూలే జయంతి సందర్భంగా ఉపాధ్యాయలను పూలే అవార్డు ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మండల విద్యాధికారిణి తాళ్ల రేణుక, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజన్నలు ఉత్తమ మహిళ ఉపా ధ్యాయులు రేణుక, సరస్వతి, గంగామణి, జ్యోతిలను అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే చూపిన మార్గంలో మహిళా ఉపాధ్యాయులందరు నడవాలని, ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ కాంతయ్య, హరిచరణ్, గంగాధర్, దేవిరాజ్, విజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్, రాజేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు దత్తప్రసాద్, చంద్రదేవ్, శ్రీదేవి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల అసోసియేట్ అధ్యక్షుడు రాజేంద్ర పాల్గొన్నారు.

మంగి రాములు మహరాజ్‌కు సన్మానం

నందిపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ అండల్ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ కేదా రేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ మంగి రాములు మహరాజ్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగి రాములు మహరాజ్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బైండ్ల ప్రశాంత్, తుక్కన్న, గంగాధర్ తధితరులు ఉన్నారు.

మండల క్రీడల్లో సత్తాచాటిన పడిగెల విద్యార్థులు

వేల్పూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ప్రాథమిక పాఠశాల క్రీడల్లో పడిగెల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తమ సత్తా చటారు. మండల స్థాయి క్రీడల్లో పడిగెల గ్రామ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆరు షీల్డ్‌లను సాధించి ఓవరల్ చాంపియన్‌షిప్‌గా నిలిచారు. కబడ్డీ, ఖోఖో, పరుగుపందెం, స్కిపింగ్, తదితర క్రీడల్లో రాణించారు. ఈ సందర్భంగా షీల్డ్, బహుమతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలోని ప్రధాన వీధులగుండా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తమ పాఠశాల విద్యార్థులు మండలస్థాయి క్రీడల్లో ఓవర్ చాంపియన్‌షిప్‌గా నిలవడం పట్ల విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయురాలు సరోజిని ఉపాధ్యాయులు శంకర్, రాకేష్, నాగరాజు, ప్రవీన్, అజయ్, రేణుక, భార్గవిలు అభినందించారు.

సదర్ కేంద్రానికి బాలిక తరలింపు

బోధన్‌రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బోధన్ బస్టాండ్ ప్రాంగణంలో 11ఏళ్ల బాలిక ఒంటరిగా ఉండడాన్ని గమనించిన పీఎల్‌వీ పద్మాసింగ్, రమణ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ స్వరూప బాలికను గమనించి పిలిచి మాట్లాడారు. బాలిక విషయాలు ఆరా తీయగా తన పేరు సావిత్రి అని తన నాన్న పేరు పోశెట్టి అని నివాసం కోటగిరి అని తెలిపిందని పద్మాసింగ్ తెలిపారు. బాలిక తల్లి మృతి చెందిన తర్వాత నాన్న మరో వివాహం చేసుకున్నాడన్నారు. నాన్న మానసిక రుగ్మత వల్ల ప్రస్తుతం ఏటో వెళ్లిపోయాడని తెలిపారు. తన పిన్ని తనను హింసిస్తూ బాధపెడుతూ డబ్బులు కోసం అడుక్కు రమ్మని ఆదేశిస్తుందని రోదిస్తూ తెలిపిందన్నారు. తన పిన్ని ఇంటి నుంచి పంపించడంతో ఇరుగు పొరుగు వారు బోధన్ ఆర్టీసీ బస్సు ఎక్కించారన్నారు. విషయం తెలుసుకున్న పీఎల్‌వీ పద్మాసింగ్ బృందం బస్టాండ్ చేరుకుని బాలికలను గమనించి పూర్తి వివరాలు సేకరించి బోధన్‌లో ఉన్న సదర్ కేంద్రంలో రక్షణ కోసం తీసుకెళ్లామన్నారు.

నూతన గోదాం నిర్మాణానికి భూమిపూజ

సాలూర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో నూతన గోదాం నిర్మాణానికి డీసీసీబీ డైరెక్టర్, సొసైటీ చైర్మన్ గిర్ధావర్ గంగారెడ్డి భూమి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గోదాం నిర్మాణ స్థలంలో ముళ్ల పొదలను తొలగించి జేసీబీతో శుక్రవారం భూమి పదును కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్దాపూర్ సొసైటీ పరిధిలోని రాజీవ్‌నగర్ తండా, ఊట్‌పల్లి, ఏరాజ్‌పల్లి, అమ్దాపూర్ తదితర గ్రామాల రైతులకు ఈ గోదాం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వివిధ గ్రామాల చిన్న, సన్నకారు రైతులు వడ్లు ఆరబెట్టుకోవడానికి ప్లాట్‌ఫామ్ నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రాజేశ్వర్, సొసైటీ వైస్ చైర్మన్ తిర్మలేష్, డైరెక్టర్లు పోతన్న, చిన్న సాయిలు, కుర్మ రాజు, రతన్, నాయకులు సుమన్ గుప్తా, సుదర్శన్, సాయి, లక్ష్మణ్ గౌడ్, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాష దినోత్సవం

డొంకేశ్వర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశ్వహిందీ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 2006 జనవరి 10వ తేదీన హిందీ సమ్మేళనంలో భారత ప్రభుత్వం హిందీ భాష దినోత్సవంగా జరుపుకోవాలని గుర్తించిందని పాఠశాల హెచ్ఎం సురేష్‌కుమార్, ఉపాధ్యాయుడు గంగాధర్ విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాసం, కవిత పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్‌కుమార్, గంగారెడ్డి, సదానంద్, వెంకటరమణచారి, సాయికుమార్, సాగర్, రవి, కిరణ్, రాజేశ్వర్, సాయిలు, రాణి, అలివేణి, మంగమ్మ, విజయలక్ష్మీ, చంద్రకళ, లావణ్య, రోజా, తదితరులు పాల్గొన్నారు.

కోనాపూర్ విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ

కమ్మర్‌పల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండంలో కోనాపూర్ విద్యార్థులకు (క్రీడాకారులకు) శుక్రవారం గ్రామానికి చెందిన నల్ల గంగాధర్ క్రీడాదుస్తులను వితరణ చేశారు. ఈ క్రీడాకారులు జగాత్యాల జిల్లా కథలాపూర్ మండలం ఊట్‌పల్లి లో కరీనగర్ నిజామాబాద్ ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహింపబడే క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు, ఈ క్రీడల్లో విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను కనబర్చి ఉత్తమ క్రీడాకారులుగా రాణిస్తూ గ్రామం పేరును నిలపాలని దాత గంగాధర్ ఆకాంక్షించారు.

అంకాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఆర్మూర్‌రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో శుక్రవారం సీసీ రోడ్డు పనులను వీడీసీ అధ్యక్షుడు సల్ల మోహన్‌రెడ్డి ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. నిధుల మంజూరు చేసిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీకార్యదర్శి సాగర్, సుర్బిర్యాల్ రాజారెడ్డి, బద్దం నర్సారెడ్డి, పైడి రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

పెర్కిట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవ్వకు బువ్వ కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాదాపు 56మంది పేద వృద్ధులు ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున పంపిణీ చేశారు. రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ తరఫున త్వరలో హెల్త్‌క్యాంప్ నిర్వహిస్తామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేశ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధానకార్యదర్శి విద్యాప్రవీన్‌పవార్, ఉపాధ్యక్షుడు జిందం నరహరి, విద్యగోపికృష్ణ, కోశాధికారి గొనే శ్రీధర్, కార్యనిర్వహఖ కార్యదర్శులు బేతు గంగాధర్, ఖాందేశ్ సత్యం, తులసీపట్వారి, సభ్యులు శరత్, విష్ణు, చైతన్య, కళ్యాణ్, సాయి, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

డొంకేశ్వర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారంపల్లి గ్రామానికి చెందిన ఆరే స్వప్నకు రూ.30వేలు, సిర్పూర్ గ్రామానికి చెందిన చుక్క రత్నాబాయికి రూ.52వేల 500, నూత్‌పల్లికి చెందిన మోర్తాడ్ రవికి రూ.19వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిసెరం భూమేష్‌రెడ్డి పంపిణీ చేశారు.

నందిపేట: మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం బాధిత కుటుంబాలకు ఆర్మూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, ఆర్మూర్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ అందజేశారు. ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధ పడుతున్న బైండ్ల గంగాధర్‌కు రూ.60వేలు చెక్కును అలాగే బ్యాగరి లక్ష్మికి రూ.12వేల చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నంగి గంగాధర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుండు హరీష్, మాజీ సర్పంచ్ మంగ్లారపు ధర్మన్న, పీఏసీఎస్ డైరెక్టర్ తోట మహేష్ ఉన్నారు.

విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు..

కమ్మర్‌పల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో నర్సాపూర్ గ్రామ పాఠశాల విద్యార్థులకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు, పండ్లు, పాఠశాలకు వైట్‌బోర్డులు అందజేశారు. అమ్మా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల పురందర్ తన కుమారుడి పడాల స్వాతిక్ జన్మదిన సందర్భంగా వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేందర్, ఉపాధ్యాయులు రాజ్ పండరి, దిలీప్ కుమార్, కావ్య, పద్మసౌజన్య, రుచిత, సంజన పాల్గొన్నారు.

మోతెలో వరి సాగు విధానంపై అవగాహన

వేల్పూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం మోతె గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం డాక్టర్ రేడ్డిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు వరిసాగులో తడిపొడి పద్దతి గురించి అవగాహన కల్పించారు. వరి నాటిన నుంచి కోతకు వచ్చే వరకు పాటించాల్సిన తడిపొడి పద్దతులతో పాటు చీడపీడల పురుదల నివారణ వంటి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో షబ్బీర్, డాక్టర్ రెడ్డిస్, సీఎఫ్ చింత శ్రీనివాస్, సనుత్న, మహేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలి

కోటగిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని ఎలాంటి ఆంక్షలు లేకుండా వర్తింపజేయాలని బీజేపీ నాయకులు నాగం సాయిలు డిమాండ్ చేశారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పథకానికి ఎకరానికి 15వేల రూపాయలు, కౌలు రైతులకు ఎకరానికి 12వేలు, పంట బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్, శ్యామల, రవి పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

నవీపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్, శివతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలికలు సంక్రాంతి ముగ్గులు వేశారు. బాలురు హరిదాసు, గంగిరెద్దుల ఆడించే వ్యక్తి వేషధారణ ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. గాలిపటాలను సైతం ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీదీప్, శివకుమార్, నాళేశ్వర్ మాజీ సర్పంచ్ సరిన్, ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని పలు విద్యాలయాల్లో శుక్రవారం మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ముగ్గుల పోటీలు, పతంగిల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు అనందంగా పాల్గొన్నారు. మండలకేంద్రంలోని శ్రీవిద్యాసాయి ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పెర్కిట్: మామిడిపల్లిలో గల నలంద పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు రంగురంగుల ముగ్గులు వేసి అలరించారు. అదే విధంగా విద్యార్థులు గాలిపటాలు ఎగురవేశారు. మహిళ ఉపాధ్యాయునీలు పంటలు సమృద్ధిగా ప్రజలు సంతోషంగా ఉండాలని ఘనంగా సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సాగర్, ప్రసాద్ పాల్గొన్నారు.

నియో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో..

నందిపేట: మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్న పిల్లలకు ఉపాధ్యా యులు భోగి పండ్ల కార్యక్రమం నిర్వహించారు. బాలికలు ముగ్గులు వేసి అందర్ని అబ్బురపరిచారు. బాలురు గాలిపటాలు ఎగుర వేశారు. చిన్న పిల్లలు గాలి పటాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోజూరి అరుణ్, ప్రిన్సిపాల్ రవి కిరణ్, ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు.

పడిగెల పాఠశాలలో..

వేల్పూర్: మండలంలోని పడిగెల పాఠశాలలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు పతంగి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాంచందర్, ఉపాధ్యాయులు శంకర్, నారాయణ, శ్రీనివాస్, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నాళేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

సంస్కృతి, సంప్రదాయాలపై మక్కువ చూపేలా చూడాలి

బోధన్‌రూరల్: విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలపై మక్కువ చూపేలా చూడాలని శ్రీసాయి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ పూదోట జయప్రకాష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీసాయి ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలలో భాగంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు రంగురంగుల ముగ్గులతో పాఠశాల ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. భోగిపండ్లు, భోగి మంటలతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యావికాస్ వ్యవస్థాపకులు శ్రీనివాస్, ఉషోదయ డైరెక్టర్ సునీత, ప్రైవేటు విద్యాసంస్థల బోధన్ అధ్యక్షుడు హరికృష్ణ, పాఠశాలల ప్రతినిధులు జయప్రకాష్ పాల్గొన్నారు.

జానకంపేట పాఠశాలలో..

ఎడపల్లి: మండలంలోని జానకంపేట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలను రంగుల ముగ్గులతో అలంకరించి, గాలి పటాలను ఎగురవేశారు. అనంతరం భోగిమంటలు వేసి విద్యార్థులు సంతోషంగా పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోన్స్ మాట్లాడుతూ విద్యార్థులకు సంక్రాంతి యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ వేడుకలను నిర్వహించడం జరిగిందన్నారు.





హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు



పోటీలో పాల్గొన్న మహిళలతో సినీనటి వైష్ణవీ చైతన్య

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర స్థాయి ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్

ముత్యాల ముగ్గులు నేలమ్మను పలకరించాయి. చుక్కలతో వేసిన రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలు.. చెరుకుగడలు.. పిండి వంటల అలంకరణలతో సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ పోటీలు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ జీహెచ్‌ఎంసీ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా శుక్రవారం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథులు సినీనటి వైష్ణవీచైతన్య, సినీనటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్ బహుమతులను అందజేశారు.



ముగ్గు వేస్తున్న సినీ నటి వైష్ణవీ చైతన్య





పోటీలో రంగవల్లులు వేస్తున్న మహిళలు



ముగ్గు వేస్తున్న మహిళ



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్, చిత్రంలో న్యాయ నిర్ణేతలు పి. రజని, డాక్టర్ పి. శ్రీలక్ష్మి, నటి వైష్ణవీ చైతన్య, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్

పాఠశాలల్లో ఘనంగా ముందస్తు సంక్రాంతి

కామారెడ్డి జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు సంక్రాంతి ముందస్తు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన వేడుకలు ఆద్యాంతం సంస్కృతి, సంప్రదాయాలు, అచార వ్యవహారాలను ప్రతిబింబించేలా పాఠశాలల్లో పలు కార్యక్రమాలు, ప్రదర్శనలు కొనసాగాయి. ఆయా పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. విద్యార్థినులు తెలుగుదనం ఉట్టిపడేలా దుస్తులు ధరించి పాల్గొన్నారు. హరిదాసు, రైతుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.



బీర్కూర్ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు



అక్షర పాఠశాలలో వివిధ వేషధారణలో విద్యార్థులు



ముగ్గుల పోటీలో పాల్గొన్న బాలికలు



మాచారెడ్డిలో ముగ్గులు వేస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



భిక్కనూరులోని సిద్దార్థ పాఠశాలలో భోగి మంటలు వేస్తున్న దృశ్యం

● అక్షరలో పాఠశాలలో..

కామారెడ్డిటౌన్, జనవరి10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పం డుగను పురస్కరించుకుని కా మారెడ్డి జిల్లాకేంద్రం లోని అక్ష ర ఉన్నత పాఠశాలలో శనివా రం సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. పా ఠశాల ఆవరణ లో చిన్న కుటిరాలు ఏర్పాటుచేసే పచ్చనైన పల్లె వాతావర ణాన్ని సృష్టించి వేడుకలను జరిపారు. విద్యార్థులు సంప్ర దాయ దుస్తులు ధరించి ముగ్గుల పోటిలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పా ఠశాల చైర్మన్ అశోక్‌రెడ్డి, కరస్పాండెంట్ లోకేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ సరితారెడ్డి,ఉపాధ్యాబృందం పాల్గొన్నా రు.

● ప్రభుత్వ పాఠశాలలో ముగ్గుల పోటీలు

మాచారెడ్డి, జనవరి10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండు గను పురస్కరించుకుని మాచారెడ్డి మండలం సోమారంపే ట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సంబరాలు నిర్వహిం చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల ఆవరణ లో విద్యార్థినిలు రంగురంగుల ముగ్గులను వేసి కళానైపు ణ్యాన్ని ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందించా రు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్క ర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, పోశెట్టి, సం తోష, సంధ్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

● బీర్కూర్ పాఠశాలలో..

బీర్కూర్, జనవరి10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బీర్కూర్ మండలంలోని వివిధ పాఠశాల ల్లో శుక్రవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. బీర్కూర్ మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాటశాలలో ఉపాధ్యాయులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థి నులు రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఫణిశ్రీ, ఉపాధ్యాయులు రాజు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిలోని పాఠశాలల్లో

ఎల్లారెడ్డి, జనవరి10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడు కలు నిర్వహించారు. విద్యార్థులందరూ సాంప్రదాయ వస్త్రా. దారణాలు ధరించి రంగవల్లులు గాలి పటాలు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

● అచ్చంపేట పాఠశాలలో పోటీలు

నిజాంసాగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థి విద్యా ర్థులకు ముగ్గుల గాలి పటాల పోటీలు నిర్వహించి బహు మతులను అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి, టీఆర్టీ అధ్యక్షుడు సంతోష్‌కు మార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లాల్‌సింగ్, ఉపాధ్యా యులు జోసఫ్, సాయిప్రసాద్, మౌనిక, తదితరులున్నారు.

● సిద్దార్థ పాఠశాలలో..

భిక్కనూరు, జనవరి10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ని సిద్ధార్థ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి పండుగ వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినీలు, ఉపాధ్యాయులు తీరొక్క ము గ్గులువేసి వాటిని రంగులతో అందంగా తీర్చిదిద్దారు. అనం తరం ప్రైమరీస్థాయి విద్యార్థులకు నేరేడుపండ్లు పోసిపాలు పొంగించి బోగిమంటలు వేశారు. సంక్రాంతి విశిష్టతను పా ఠశాల కరస్పాండెంట్ సుధాకర్ వివరించగా, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గ్రామీణస్థాయిలో క్రీడా పోటీలు అభినందనీయం

● క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని కొత్తబాద్ గ్రామంలో నిర్వహిస్తున్న కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్ర వారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ప్రార ంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని, గ్రామీణస్థాయి క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రికెట్ టోర్నీలు ఎంతో దోహద పడతాయని అన్నారు. క్రీడాకలరులు తమ ప్రతిభను వెలికితీయాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, అంజి రెడ్డి, శ్రీధర్, జిల్లా యువజన అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, యువజన అ ధ్యక్షులు మన్సూర్, సాయిరెడ్డి, సాయిలు, షాదుల్, జీవన్, పాల్గొన్నారు.



కొత్తబాదిలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజ్


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ముగిసిన కాకతీయ విద్యా సంస్థల క్రీడోత్సవ్

నిజామాబాద్ అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా నగరంలోని కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలలో జరుగుతున్న క్రీడోత్సవ్ పోటీలు శుక్రవారం ముగిసాయి. వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు విద్యాసంస్థల డైరెక్టర్ రామోజీరావు బహుమతులను అందజేశారు. సుభాష్‌నగర్‌లోని కాకతీయ ఒలంపియాడ్ పాఠశాల, ప్రగతినగర్‌లోని ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులకు క్రీడోత్సవ్ పేరుతో పోటీలను నిర్వహిస్తున్నారు. చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు అవసరం అనే ఉద్దేశంతో రెండేళ్లుగా క్రీడా పోటీలను పాఠశాలస్థాయిలో నిర్వహిస్తున్నామని రామోజీ రావు తెలిపారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు పతంగుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సుభాష్‌నగర్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ దిగంబర్, తదితరులు పాల్గొన్నారు.

'టీయూలో ఈసీ నిర్ణయాలు ఎందుకు అమలు చేయడం లేదు'

నిజామాబాద్ అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో ఈసీ నిర్ణయాలు ఎందుకు అమలు చేయడం లేదని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ యూనివర్సిటీ అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం నగరంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారికంగా చేసిన ఈసీ నిర్ణయాలను అమలు ఎందుకు జరపడం లేదని విద్యార్థి సంఘాలు కొట్లాడి అవినీతి అధికారులను వెనక్కినెట్టితే ఇప్పుడు వచ్చిన వారు వారిపై చర్యలు తీసుకునేందుకు వెనకాడుతున్నారన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు కట్టిన డబ్బులను అవినీతి చేసిన అధికారుల నుంచి ఎందుకు రికవరీ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. గత పాలకమండలి నిర్ణయాల అమలు, విద్యార్థుల శ్రేయస్సుకోరే నిర్ణయాలు చేయకపోతే భవిష్యత్తులో ఉద్యమించాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు దేవిక, సాయికిరణ్, ముక్తశ్రీ, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో దొంగల హల్‌చల్

ఖిల్లా, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు వేరువేరు చోట్ల దొంగలు హల్‌చల్ చేశారు. పూసలగల్లి ప్రాంతంలో ఉండే అరుణ ఫ్యాబ్రిక్ వస్త్ర దుకాణంలో గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి చొరబడి దుకాణంలో ఉన్న సుమారు 3లక్షల నగదు అపహరించారు. అదేవిధంగా నగరంలోని ఓ మెడికల్ షాపు షట్టర్ ధ్వంసం చేసి లోనికి వెళ్లి దొంగతనానికి పాల్పడినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్‌హెచ్‌వో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలో గల సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న నగర ఇన్‌స్పెక్టర్

ఖిల్లా, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వినాయక్‌నగర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 461 గ్రాముల గంజాయిని, ఐదు సెల్ ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు, గంజాయి ప్యాకింగ్ చేయడానికి వినియోగించే 18 ఖాళీ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నట్లు నగర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు తెలిపారు. వివరాలను ఆయన చాంబర్‌లో నాల్గో టౌన్ పోలీసు స్టేషన్ ఎస్ఐ శ్రీకాంత్‌తో కలిసి వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో వినాయక్‌నగర్‌లోని ఓ ఇంటిలో దాడి చేశామన్నారు. ఈ దాడిలో విక్రయించడానికి నిలువ ఉంచి గంజాయిని గుర్తించామన్నారు. గంజాయిని అమ్మడానికి యత్నిస్తున్న ఆకాష్, రోహిత్ కుమార్, శివరారామతేజ్‌రెడ్డి, రాకేష్ మరో మైనర్‌లను అదుపులోకి తీసుకుని వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బంగారు దుకాణంలో చోరీ

డిచ్‌పల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : డిచ్‌పల్లి బస్టాండ్ కూతవేటు దూరంలోని ఓ నగల దుకాణంలో శుక్రవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. తాళాలు ధ్వసం చేసి దుకాణంలో ఉన్న 75వేల రూపాయల విలువల గల వెండి నగలను, రూ.2వేల నగదు ఎత్తికెళ్లిన్నట్లు బాధితుడు సుద్దులం వాసి లక్ష్మీనర్సయ్య పోలీసులకు పిర్యాదు చేశారు. గుర్తు తెలియని దొంగలు షాపులో ఉన్న అద్దాలను పగల గొట్టడంతో పాటు లాకర్ లను తెరి చేందుకు ప్రయత్నాలు చేశారు. దొంగలుసీసీ కెమెరాల హర్డ్ డిస్కును చోరీ జరిగిన విషయాలు కనిపించకుండా వెంట తీసుకెళ్లిన్నట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు.

టీయూ విద్యార్థి గణేశ్ కు డాక్టరేట్

డిచ్‌పల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : టీయూ ఫార్మాసుటికల్ కెమిస్ట్రీ విభాగంలో పరిశోధక విద్యార్థి గణేశ్ బాబుకు డాక్టర్ వాసం చంద్రశేఖర్ అసోసియేట్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో ప్రిపరేషన్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ నానోస్ట్రక్చర్ మిక్స్‌డ్ మెటలాక్సైడ్ క్యాటలిస్ట్ ఫర్ ఎరబిక్ యాక్సిడేషన్ ఆఫ్ అల్కాహాల్స్ అండ్ ఖండేన్స్ ఆఫ్ ఆడేయిడ్స్ అనే అంశంపై పరిశోధన జరిపారు.మౌఖిక పరీక్షకు ఎక్స్టార్నల్ ఎక్సామినార్‌గా జేఎన్‌టీయూ అధ్యాపకుడు ఆశోక్ హాజరై పరిశోధన సిద్ధాంత గ్రంథంపై ప్రశ్నలు లేవనెత్తారు. అన్నీ ప్రశ్నాలకు విద్యార్థి సమాధానాలు తెలపడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

మోపాల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని నర్సింగ్‌పల్లిలో గల ఇందూరు తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శనానికి బారులు తీరారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆర్యనగర్‌లో ఉన్న వెంకటేశ్వర ఆలయం, మాధవనగర్ సాయిబాబా ఆలయం, నిజామాబాద్ రూరల్ మండలంలోని సారంగపూర్ గ్రామంలో ఉన్న రామాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆల యాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఇందూరు తిరుమల ఆలయానికి రాజకీయ నాయకులతో పాటు అధికారులు, నిజామాబాద్ నగర ప్రజలు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

డిచ్‌పల్లి: ధర్మారం(బి) వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ దేవి భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తు లు 3గంటల నుంచే భారులు తీరారు.

బెటాలియన్‌లో ..

వైకుంఠ ఏకాదశి పురష్కరించుకొని ఏడో పోలీస్ బెటాలియన్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కమాండెంట్ దంపతులు సత్యనారాయణ స్వామి వారిని ఆలయ ప్రాంగణం వరకు పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజల్లో పాల్గొనేందుకు బెటాలియన్ సిబ్బంది తరలి వచ్చారు.


బెటాలియన్ లో స్వామి వారికి పూజలు చేస్తున్న కమాండెంట్ దంపతులు

గరుడ వాహనంపై ఆండాల్ సమేత వెంకటేశ్వర స్వామి

నిజామాబాద్ కల్చరల్: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని చక్రంగుడి లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆండాల్ సమేతంగా గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఆల యంలోని ఉత్తర ద్వారం గుండా గరుడ వాహనంపై స్వామి భక్తులకు దర్శనమించి ఆలయ మాడవీధుల గుండా ఊరే గారు. భక్తుల గోవింద నామస్మరణలు, మేళ తాళాలు, మంగళ హారతులతో స్వామివారి ఊరేగింపు వైభవోపేతంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కంధాళై నాగరాజాచార్య, హయగ్రీవాచార్య, రఘురాం, నర్సింహామూర్తి, శ్రీనివాసాచార్య, రామాచార్య, శ్రీవర్ధనాచార్య, సంపత్‌కుమారాచార్య, శశికుమార్ ఆచార్య, వైభవ్ ఆచార్య, రుషి ఆచార్య, భక్తులు పాల్గొన్నారు.


ఇందూరు తిరుమలలో పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

అత్యంత శ్రేష్టమైనది.. ముక్కోటి ఏకదశి

సిరికొండ: అన్ని ఏకదశిల కంటే అత్యంత శ్రేష్టమైనది ముక్కోటి వైకుంఠ ఏకదశి అని ఇస్కాన్ గురువు గోవింద దాస అన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా సిరికొండ శ్రీ శేషశయన మందిరంలో జరిగిన కార్యక్రమంలో భక్తులను ఉద్దేశించి గోవిందదాస ప్రసంగించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని ఆలయలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యగా సిరికొండ లక్ష్మీనారాయణ శ్రీ లొంక రామలింగేశ్వర స్వామి, రామడుగు రామాలయం, మైలారం శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి, తూంపల్లి ఎదురుగొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి, వివిధ గ్రామాల్లోని హనుమాన్ మందిరాల్లో భక్తులు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థుల సమగ్ర వివరాలు అపార్‌లో నమోదు చేయాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్

బోధన్‌రూరల్,జనవరి10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సమగ్రమైన వివరాలు అపార్‌లో నమోదు చేయనున్నామని, భవిష్యత్‌లో అపార్ ద్వారానే పాఠశాల నుంచి మరో పాఠశాలకు, కళాశాలకు ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయనున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఉప విద్యాధికారి కార్యాలయంలో బోధన్ పట్టణ, మండలంలోని ప్రైవేటు, ఎయిడెడ్ సాంఘిక సంక్షేమ, జ్యోతిబాపూలే, మైనారిటీ పాఠశాలల, కళాశాలల ప్రధానోపాధ్యాయులకు, కళాశాల ప్రిన్సిపాళ్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 25వ తేదీలోపు అపార్‌ను వందశాతం పూర్తి చేయాలన్నారు. అపార్ నమోదును పక్క రాష్ట్రాలతో వెనుకబడి ఉన్నామని కావున పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాళ్లు ముఖ్యమైనదిగా భావించి ఈ నెల 25వ తేదిలోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, సీఆర్‌పీలు విజయ్, యుసుఫ్, విజయ, రేఖ, శివానంద్, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్‌లు కొడాలి కిషోర్, హరికృష్ణ, శ్రీనివాస్, చక్రవర్తి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈవో అశోక్

అభ్యాస స్కూల్‌లో శృత మహోత్సవప్రదర్శన

నిజామాబాద్ అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్థానిక వినాయక్‌నగర్‌లోని అభ్యాస ది స్కూల్‌లో శృత మహోత్సవ (అన్ని సబ్జెక్టుల ప్రాజెక్టు ప్రదర్శన) వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్ర మానికి డీఈవో అశోక్ హాజరై ప్రారంభించారు. విద్యార్థులు చేసి ప్రదర్శించిన ప్రాజెక్టులను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై చేసిన ప్రాజె క్టులు బాగున్నాయని అదేవిధంగా కృషి చేస్తే మంచిస్థాయికి ఎదుగుతారని ప్రోత్సహించారు. అభ్యాస స్కూల్ కరస్పాండెంట్ చెన్న అన్నపూర్ణ మా ట్లాడుతూ సైన్స్ ఫేర్‌కు భిన్నంగా అన్ని సబ్జెక్టుల నుండి 168 ప్రాజె క్టులు ప్రదర్శనకు ఉంచామన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలను, సృజనాత్మకంగా మలిచి ప్రదర్శించినందుకు విద్యార్థులకు, గైడ్ టీచర్లను అభినందించారు. విద్యార్థుల సృజనాత్మక కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ పి.శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రధానో పాధ్యాయులు మాధవి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్


మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బోదన్ పట్టణంలోని ఇందూర్ మోడల్ స్కూల్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని, ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. యువత ద్విచక్ర వాహనాలు నడిపించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిషోర్‌కుమార్, ఎంవీఐ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, పట్టణ సీఐ వెంకటనారాయణ పాల్గొన్నారు.

గన్నారం హైస్కూల్‌కు కంప్యూటర్లు వితరణ

ఇందల్వాయి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన ఎస్అండ్‌పీ గ్లోబల్ సంస్థ ప్రతినిధి కుంట రాజారెడ్డి ఒక లక్షా 50వేల రూపాయలు విలువ చేసే ఏడు కంప్యూటర్‌లు, ఒక ప్రొజెక్టర్‌ను శుక్రవారం పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి కుంట రాజారెడ్డి మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలనే ఉద్దేశంతో తాను నడుపుతున్న సంస్థ ద్వారా ఏడు కంప్యూటర్‌లు అందించామన్నారు. ప్రతీ విద్యార్థిలో చిన్నప్పటి నుంచే కంప్యూటర్ పరిజ్ఞానం అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు కంప్యూటర్లు అందజేయడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వరప్రసాద్, మునీందర్, మాజీ సర్పంచ్ కుంట మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ బైరయ్య, కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటగిరి జడ్పీలో రామాయణ నాటిక ప్రదర్శన

కోటగిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పేర్కొన్నారు. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం రామాయణ దృశ్యరూప కావ్యాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. 80మంది విద్యార్థులు 43స్కిట్ల రూపంలో నిర్వహించిన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ చదువుతో పాటు సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండడం తప్పనిసరన్నారు. విద్యార్థుల ప్రదర్శన తనను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. అనంతరం పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. వచ్చే 10వ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాస్‌రావు, శంకర్, జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు అలివేలు, పీఆర్‌టీయూ అధ్యక్షుడు బర్ల సాయిలు, కార్యదర్శి ఉదయ్ చందర్, పీఆర్‌టీయూ నాయకులు గంగారాజు పాల్గొన్నారు.


కోటగిరిలో విద్యార్థుల రామాయణ ప్రదర్శన

ఎస్ఎస్ఆర్ డిస్కవరీలో సంక్రాంతి వేడుకలు


ఎస్ఎస్ఆర్ డిస్కవరీలో సంక్రాంతి సంబురాలు

నిజామాబాద్ అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా నగర శివారులోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ పాఠశాలలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసి విద్యార్థులు హరిదాసు, ఇతర వేషాధారణలో సందడి చేశారు. గంగిరెద్దులను తీసుకువచ్చి హరిదాసు కీర్తనలతో సంక్రాంతి సంబరాలను పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ మారయ్యగౌడ్, కరస్పాండెంట్ హరితాగౌడ్, ప్రిన్సి పాల్ భాస్కర్, తదితరులు హాజరయ్యారు. రంగోళి, ఫుడ్‌ఫెస్టివల్ పోటీ లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పాఠశాలల్లో సంక్రాంతి శోభ

ధర్పల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల్లో సంక్రాంతి శోభ సంతరించుకుంది. శనివారం నుంచి పాఠశాల లకు సంక్రాంతి సెలవులు కావడంతో శుక్రవారం మండల కేంద్రంలో గల లిటిల్ హర్ట్స్ పాఠశాలలో చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శన, రంగవల్లులు, డూడూ బసవన్నలు, హరిదాసుల వేషధారణలతో ఆక ట్టుకున్నా రు. విద్యార్థి దశ నుంచే పండుగ ప్రాముఖ్యతను వివరిం చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కరస్పాండెంట్ శ్రీకాం త్ తెలిపారు. చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శన గ్రామ స్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యురాలు సాధన, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ధర్పల్లిలో సంక్రాంతి పండుగలో పాల్గొన్న చిన్నారులు

గ్రామాల్లో పోటాపోటీగా ముగ్గులు

మోపాల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్క రించుకొని గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఇప్పటి నుంచి పోటా పోటీగా ముగ్గులను వేస్తున్నారు. మండలంలోని ఆయా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. సంక్రాంతి సెలవులు రావడంతో ముందుగానే విద్యార్థులచే సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పోటాపోటీగా తమ ఇళ్ల ముందు రంగులతో అందంగా ముగ్గులను వేశారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి.. పేదల పాలిట వరం

సిరికొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి అన్నారు. సిరికొండ మండలం రామడుగు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులకు ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మంజూరు చేయించారని రవి చెప్పారు. శుక్రవారం ఆర్థిక సహాయం చెక్కులను బాధిత కుటుంబాలకు ఆయన అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండి అనారోగ్యానికి గురైన రోగులకు ఆసుపత్రిలో చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేయడం పేదోళ్లకు ఆరోగ్య ప్రధాయిని అన్నారు. సాయిరి నర్సయ్యకు రూ.60 వేలు, దర్శనం రవళికి రూ.అరువై వేలు,సయ్యద్ జేబునిషాకు రూ.18500లు, చింతపండు రాధకు రూ.13వేల చెక్కులను రవి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాకారం సంతోష్, కుందేళ్ల శ్రీనివాస్, కిష్టారెడ్డి,సాయిలు పాల్గొన్నారు.

తాజా కూరగాయలను అందించాలి

సిరికొండ జనవరి 10 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులకు తాజా కూరగాలయను వండించాలని సిరికొండ తహసీల్దార్ రవీందర్‌రావు కెజీబీవీ పాఠశాల ప్రత్యే అదికారి పర్వీన్ బేగంను ఆదేశించారు. కేజీబీవీ వసతి గృహాన్ని తహసీల్దార్ రవీందర్ ఎంఈవో రాములుతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. స్టోర్ గదిలోకి వెళ్లి బియ్యాన్ని, కూరగాయలను, బోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు తాజాగా కూరగాయలను తెప్పించి వంట చేయించాలని సూచించారు. ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం బోజనాన్ని పెట్టాలని ఆయన కోరారు.

టీయూలో స్వచ్ఛభారత్

డిచ్‌పల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాల కామారెడ్డికి చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీ, బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్, క్యాంపస్ చుట్టుపక్కల చెత్తా చెదారాలను, ముళ్లపొదలను తొలగించారు. ప్లాస్టిక్ బాటిల్స్, ప్లాస్టిక్ కవర్లు ఏరివేసి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరిలు పరిశీలించి వాలంటీర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సీఈవో డాక్టర్ ఎం.జైపాల్‌రెడ్డి, డీన్ నవీన్‌కుమార్, కోఆర్డినేటర్ దత్తాద్రి, ప్రిన్సిపల్ సైదయ్య, గోవర్ధన్‌రెడ్డి, గంగాధర్, వైస్ ప్రిన్సిపల్స్, ఎన్ఎస్ఎస్ పీవో వెంకటేశ్వర్లు, లింగం, నర్సారెడ్డి, మురళి, రాజు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.240	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	రూ.135	రూ.245	రూ. 265

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.80400	రూ.74100	రూ.955

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

- స్క్రీన్-1 : గేమ్ చేంజర్ (4.30, 8.00, 11.30, 3.00, 6.30, 10.00)
- స్క్రీన్-2 : గేమ్ చేంజర్ (5.30, 9.00, 12.30, 4.00, 7.30, 11.00)
- స్క్రీన్-3 : గేమ్ చేంజర్ (5.10, 8.40, 12.10, 3.40, 7.10, 10.40)
- స్క్రీన్-4 : గేమ్ చేంజర్ (4.00, 7.30, 11.00, 2.30, 10.25) : పుష్ప-2 (6.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : గేమ్ చేంజర్ (7.15, 10.35, 2.15, 5.45, 9.15)
- స్క్రీన్-2 : గేమ్ చేంజర్ (7.45, 11.15, 2.45, 6.15, 9.50)
- స్క్రీన్-3 : గేమ్ చేంజర్ (8.10, 11.45, 3.15, 6.45, 10.15)

- దేవి : గేమ్ చేంజర్ (11.00, 2.00, 6.00, 9.00)
- నటరాజ్ : గేమ్ చేంజర్ (హిందీ) (11.00, 2.00, 6.00, 9.00)
- విజయ్ : పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)
- లలితామహల్ : గేమ్ చేంజర్ (11.00, 2.00, 6.00, 9.00)

- నిజామాబాద్ అర్బన్